సాక్షి
కాకినాడ

మంగళవారం । 18 । జూన్ । 2024



రూ.లక్ష విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి కె.రవికిషోర్, వెంకట రత్నకుమారి దంపతులు (ర్యాలి) రూ.1,00,008 విరాళం సమర్పించారు.



సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి..

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి పి.రోజా శ్రీదేవి (కాకినాడ) సోమవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 7,845 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 7,845 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,180, మధ్య డెల్టాకు 1,565, పశ్చిమ డెల్టాకు 4,100 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.10 అడుగులకు చేరింది.

వేడుక చూసి.. జగమంతా మురిసి

- కోనసీమ ఇలవేల్పునకు కల్యాణ తిలకం
- వైభవంగా అప్పనపల్లి స్వామి పరిణయోత్సవం
- కోలాహలంగా స్వామివారి క్షేత్రం



కల్యాణ వేడుక వీక్షిస్తూ.. తరిస్తూ..



గ్రామోత్సవంలో కోలాటం.. ఆర్భాటం



బాలాజీ కల్యాణం.. అపురూప ఘట్టం

మామిడికుదురు: మూడు ముడులు, ఏడడుగులతో ఆ బంధం ముడిపడింది.. ముల్లోకవాసుని పరిణయోత్సవం అంబరాన్నంటింది.. కలియుగ దైవం, కోనసీమ ఇలవేల్పు అయిన అప్పనపల్లి స్వామివారు కల్యాణ తిలకం దిద్దుకుని దేవేరులకు పూలమాల వేయగా జగమంతా మురిసింది.. మంగళ వాయిద్యాల నడుమ శుభసమయాన స్వామివారి కల్యాణం ముల్లోక వేడుకను తలపించింది. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవం సోమవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుభ ముహూర్తాన ఈ ఘట్టం కనులకు విందు అయ్యింది. ఉభయ దేవేరులతో కొలువు దీరిన ఆ స్వామిని చూసి వేలాదిగా వచ్చిన భక్తజనం మురిసిపోయింది. ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఉదయం సుప్రభాత సేవతో మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దేవస్థానం ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి వారి శిష్య బృందం ఆధ్వర్యంలో శ్రీవారికి సహస్రనామార్చన, బాలభోగ నివేదన, చతుస్థానార్చన, ధ్వజారోహణ పూజలు చేశారు. ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ట్రస్టు బోర్డు సభ్యుల పర్యవేక్షణలో కల్యాణ మహోత్సవం ఆద్యంతం రమణీయంగా సాగింది.

సంతానప్రాప్తికి పూజలు

సంతానం లేక ఇబ్బంది పడుతున్న మహిళలకు ఉదయం ధ్వజారోహణం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ ప్రసాదాన్ని తినడం ద్వారా స్వామి కృపతో సంతాన యోగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

కనులకు వైభోగంలా..

వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణలు, బాణసంచా కాల్పుల నడుమ శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన బాల బాలాజీ స్వామివారిని గ్రామ పురవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగించారు. ఈ గ్రామోత్సవం కనుల పండువలా సాగింది. భక్తులు, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది వెంట సాగగా అనేకమంది ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. స్వామివారి ఆలయాన్ని పలు రకాల బెంగళూరు పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ప్రత్యేక ఆకర్షణగా కోలాటం

ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన హరే శ్రీనివాస్ కోలాటం ఆహూతులను ఆనంద పరవశులను చేసింది. అలాగే కేరళ వాయిద్యాలు భక్తులను తన్మయత్వంలో ముంచెత్తాయి. అప్పనపల్లికి చెందిన వాణీ మహిళా సత్సంగ మిత్ర బృందం సభ్యులు ఆలపించిన శ్రీలలితా విష్ణు సహస్రనామ పారాయణ, అరుణకుమారి భజన సమాజం, జీవీ రమణ ఆలపించిన భజనలు అలరించాయి.

నయనానందం.. కల్యాణోత్సవం

బాలాజీ స్వామి దివ్య తిరు కల్యాణోత్సవం రాత్రి 8.59 గంటలకు అట్టహాసంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల గుణగణాలను భక్తులకు వివరిస్తూ నిర్వహించిన రాయబారోత్సవం (ఎదుర్కోలు సన్నాహం) ఆకట్టుకుంది. సర్వాంగ సుందరంగా అలంకరించిన మంటపంలో శ్రీదేవి, భూదేవిలతో కొలువు దీరిన బాల బాలాజీ స్వామి తన దివ్య మంగళ స్వరూపంతో భక్తులకు కనువిందు చేశారు. వేలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్ల తేజోవంతమైన స్వరూపాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. కల్యాణోత్సవంలో 315 మంది భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం తరఫున డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్, అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఏసీ వి.సత్యనారాయణలు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. రావులపాలేనికి చెందిన మన్యం ప్రదీప్ ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఆర్‌జేసీ కె.సుబ్బారావు, డీసీ విజయరాజు, జిల్లా ఏసీ డి.నాగమల్లేశ్వరరావు, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎంపీపీ వనజకుమారి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సత్యదేవునికి ఘనంగా ఏకాదశి పూజలు



సత్యదేవుని దర్శనానికి కిక్కిరిసిన భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవునికి జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర పూజలు, 9 నుంచి 11 గంటల వరకూ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి అర్చక స్వాములు, వేద పండితులు మంత్రపుష్పాలు, వేదాశీస్సులు అందజేసి, ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. ఏకాదశి పర్వదినం, బక్రీద్ సెలవు కావడంతో వేలాదిగా భక్తులు సత్యదేవుని సన్నిధికి తరలివచ్చారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు రావడం ప్రారంభమైంది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, ప్రదక్షిణ చేశారు. వ్రతాలు 2,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. సుమారు 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, ఈశ్వరుడిని ముత్యాల కవచాల(ముత్తంగి)తో అలంకరించి, పూజించారు. ముత్తంగి కవచాలంకరణలో స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించి, తరించారు.

బాబుగారి సాయం ఎప్పుడో!

- నేడు పీఎం కిసాన్ నగదు విడుదల చేయనున్న మోదీ
- జిల్లాలో 1,25,850 మంది రైతులకు లబ్ధి
- ప్రతి రైతు ఖాతాలో రూ.2 వేల చొప్పున జమ
- వైఎస్సార్ సీపీ హయాంలో పీఎం కిసాన్‌తో పాటు వైఎస్సార్ రైతు భరోసా రూ.5,500 అందజేత
- చంద్రబాబు సర్కారు సాయం కోసం రైతన్నల ఎదురుచూపులు



పసిడి కంకులు పండించాలంటే.. సర్కారు వారు 'తడి' అందించాల్సిందే..

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. గడచిన ఐదేళ్లూ తొలకరి సీజన్ మొదలైందంటే చాలు.. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి, ఎత్తిపోతల పథకాల నుంచి సాగుకు సకాలంలో నీరు విడుదల చేయడం.. ముందస్తు సాగుకు రైతులను ప్రోత్సహించడం.. తద్వారా ఖరీఫ్ పంట చేతికి అందే దశలో ముంపు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం.. రెండో పంటకు, మూడో పంటకు వీలు కల్పించడం.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వంటివన్నీ అందుబాటులో ఉంచడం.. అంతే కాదు.. సాగుకు అవసరమైన ప్రతి దశలోనూ రైతుకు పెట్టుబడి సాయం అందించడం.. ఇలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తమకు అడుగడుగునా అండదండగా నిలిచిన విషయం అన్నదాతలకు అనుభవైకవేద్యమే.

గత ప్రభుత్వంలో...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కలిపి రైతులకు ఏటా మూడు దఫాలుగా రూ.13,500 అందించేవారు. ఇందులో తొలి విడతగా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మే నెలలోనే కేంద్రం రూ.2,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500 కలిపి మొత్తం రూ.7,500 రైతులకు అందజేసేవి. దీనివలన చిన్న, సన్నకారు, పేద రైతులకు ఖరీఫ్ పెట్టుబడి, కోతలు, రబీ పెట్టుబడికి కొంత వరకూ వెసులుబాటు దక్కేది.

ఇది పెట్టుబడి తరుణం

ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. కేంద్ర ప్రభుత్వం గతంలో మాదిరిగానే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి మొత్తాన్ని మంగళవారం రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. తొలి విడతగా రూ.2 వేల చొప్పున అందిస్తోంది. ఈవిధంగా జిల్లాలోని 1,25,850 మంది రైతుల ఖాతాల్లో రూ.25.17 కోట్లు జమ చేయనుంది. మరోవైపు రాష్ట్రంలో కొత్తగా పగ్గాలు చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతుకు ఆర్థిక సాయంపై ఇప్పటి వరకూ అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు. ఇప్పటికే కాటన్ బ్యారేజీ నుంచి అధికారులు ఈ నెల 1న సాగునీరు విడుదల చేశారు. నారుమళ్లు వేసుకొనేందుకు రైతులు కూడా సిద్ధమవుతున్నారు. అక్కడక్కడ నారుమళ్లు వేశారు కూడా. ఇటువంటి తరుణంలో వారికి సాగు పెట్టుబడులకు డబ్బులు అవసరమవుతాయి. విత్తనాల కొనుగోలు, నారుమడులు దమ్ము చేసుకొనేందుకు వారికి పెట్టుబడి సాయం ఎంతో అవసరం.

ఆ హామీ అమలు ఎప్పుడో!

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రమం తప్పకుండా సాయం అందించడంతో రైతులకు కాస్త ఊరటగా ఉండేది. ప్రభుత్వం సాయం అందించడంతో వారు బయటి వ్యాపారుల వద్ద పెట్టుబడి కోసం ఒక్క రూపాయి కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదు. కానీ నేడు కేంద్రం రూ.2 వేలు మాత్రమే జమ చేస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఈ అంశం ఆయన ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో కూడా ఉంది. ఎన్నికల్లో గెలిచి, టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువు తీరి రోజులు గడుస్తున్నా.. రైతులకు పెట్టుబడి సాయం గురించి ఇటు సీఎం చంద్రబాబు కానీ, అటు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు కానీ ఇప్పటి వరకూ ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. దీంతో, కేంద్రం ఇచ్చే కొద్దిపాటి సొమ్ము పెట్టుబడులకు చాలక, మిగిలిన మొత్తం ఎలా సర్దుబాటు చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా త్వరగా ఆర్థిక సాయం అందిస్తే తమకు వెసులుబాటు కలుగుతుందని రైతులు అంటున్నారు.

ఇప్పుడిస్తేనే ఉపయోగం



గత ఐదు సంవత్సరాలుగా మా ఖాతాల్లో రైతు భరోసా నిధులు మే నెలలో జమయ్యేవి. కానీ ఈ సంవత్సరం జూన్ నెల వచ్చినా రైతు భరోసా నిధులు జమ కాలేదు. పీఎం కిసాన్ నిధులు మంగళవారం విడుదల చేస్తున్నారని వ్యవసాయ సిబ్బంది ద్వారా తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతు భరోసా నిధులు ఇప్పుడు వేస్తేనే మాకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగా ఇస్తే ఈలోపు బయటి వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

– రావుల ప్రసాద్, కూరాడ, కరప మండలం

రైతులకు ఎంతో ఉపయోగం



ఖరీఫ్ పనులకు జూన్ 1న నీరు విడుదల చేశారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసుకొనేందుకు ఈ మొత్తం ఎంతో ఉపయోగపడుతుంది. మంచి సమయంలో పీఎం కిసాన్ మొత్తం వారి ఖాతాల్లో జమవుతోంది. వ్యవసాయ పెట్టుబడుల కోసం ఎవరి వద్దా అప్పులు తెచ్చుకొనే అవసరం ఉండదు.

– ఎస్.విజయకుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, కాకినాడ

20 రోజుల అనంతరం స్వామి దర్శనం

కిటకిటలాడిన పంచారామ క్షేత్రం



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఏకాదశి పర్వదినం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయంలో బారులు తీరారు. ఈ క్షేత్రంలో శివలింగం జీర్ణోద్ధరణ పనుల కారణంగా గత నెల 29 నుంచి స్వామి, అమ్మవార్ల మూలవిరాట్టుల దర్శనాలు నిలిపివేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో 20 రోజుల అనంతరం సోమవారం నుంచి దర్శనాలకు అనుమతి లభించడంతో ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, అళ్లకి రాజగోపాల్‌శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తులకు దేవదాయ శాఖ సిబ్బంది, భక్తసంఘం నాయకులు సేవలందించారు. ఆలయంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగింది.



ఆలయంలో బారులు తీరిన భక్తులు

- గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం
- చక్కెర కర్మాగారాల మూసివేతే ప్రధాన కారణం
- బెల్లం తయారీకే పరిమితం
- వలస బాట పడుతున్న కూలీలు

చెరకు చేదవుతోంది!



బెల్లం తయారు చేస్తున్న కార్మికుడు

పెద్దాపురం: చెరకు సాగు రైతుకు చేదవుతోందా అంటే అవుననే చెప్పాలి. సామర్లకోట సహా పలుచోట్ల చక్కెర కర్మాగారాలు మూత పడటం, ఇతర కారణాలతో జిల్లాలో చెరకు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. ఒకప్పుడు జిల్లావ్యాప్తంగా పెద్దాపురం, సామర్లకోట, తుని, కోటనందూరు, రౌతులపూడి, ఏలేశ్వరం, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పిఠాపురం, గొల్లప్రోలు తదితర మండలాల్లో 15,379 ఎకరాల్లో రైతులు చెరకు సాగు చేసేవారు. అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం అది 1,670 ఎకరాలకు పడిపోయింది.

సాగు కాలం.. శ్రమ ఎక్కువే..

చెరకు పంట కాలం పది నెలలు. దీనికి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తి ఉంది. మధ్యలో ఒడుదొడుకులు ఉన్నప్పటికీ చెరకు సాగు లాభదాయకంగా ఉండేదని రైతులు చెబుతున్నారు. కొలు ధర కూడా గిట్టుబాటు అయ్యేది. సాగు ప్రారంభం నుంచి విత్తనం కోసం చెరకు నరకడం, విత్తనం నాటడం, ఎరువులు వేయడం, కలుపు తీత, జడలు అల్లడం (తాడు ఏత), ఎరువు వేసిన తర్వాత కాలువలు తవ్వడం, పురుగు మందులు చల్లడం, చెరకు తోట నరకడం, ఫ్యాక్టరీలకు లోడింగ్ వేయడం.. ఇన్ని పనులు చేయాల్సి ఉండేది. ఈ పనులన్నింటికీ ఎకరాకు సుమారు 150 నుంచి 200 మంది కూలీలకు ఏడాది పొడవునా పనులు దొరికేవి.

షుగర్ ఫ్యాక్టరీల ప్రోత్సాహంతో..

గతంలో చక్కెర కర్మాగారాల యాజమాన్యాలు చెరకు విత్తనాన్ని తక్కువ ధరకే ఇచ్చి, రైతులను ప్రోత్సహించేవి. పంటను కూడా వారే పొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేసేవారు. అప్పట్లో ఎక్కువ శాతం రైతులు ప్రధానంగా వరి సాగు చేసేవారు. చక్కెర పరిశ్రమలు ప్రోత్సహించడంతో ఎప్పుడూ ఒకే పంట పండించడం కంటే పంట మార్పిడి చేస్తే మంచిదనే ఉద్దేశంతో ఎక్కువ మంది రైతులు కొత్తగా చెరకు సాగు చేసేందుకు పోటీ పడ్డారు. దీంతో జిల్లాలో ఈ పంట విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దిగుబడి అధికంగా రావడంతో చక్కెర పరిశ్రమలకే కాకుండా రైతులు బెల్లం తయారీవైపు కూడా మొగ్గు చూపేవారు. వివిధ కారణాలతో ప్రస్తుతం పలు చక్కెర పరిశ్రమలు మూత పడటంతో రైతులు కేవలం బెల్లం తయారీకే చెరకును పండిస్తున్నారు. గతంలో పెద్దాపురం, సామర్లకోట ప్రాంతాల్లో 8,358 ఎకరాల్లో సాగు జరిగేది. ప్రస్తుతం బెల్లం తయారీ కోసం నియోజకవర్గంలోని పెద్దాపురం మండలం తాటిపర్తి, మర్లావ, దివిలి, తిరుపతి, చంద్రమాంపల్లి గ్రామాల్లో మాత్రమే చెరకు సాగు జరుగుతోంది. జిల్లాలోని ఇతర మండలాల్లో కూడా అక్కడక్కడ బెల్లం తయారీ కోసం రైతులు చెరకు సాగు చేస్తున్నారు.

చక్కెర పరిశ్రమల మూసివేతతో..

చెరకు రైతులను చక్కెర కర్మాగారాలు ఆదుకునేవి. రైతు చెరకు సాగు మొదలు పెట్టిన దగ్గర నుంచి విత్తనం సరఫరా చేయడం, ఎరువులు, పురుగు మందులు, గడ్డి మందులు ఇచ్చేవి. ఇవి కాకుండా చెరకు కొనుగోలు చేసిన తర్వాత టన్ను చెరకుకు కొనుగోలు పన్ను రూ.10 నుంచి రూ.60 వరకూ.. కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన తర్వాత తిరిగి నేరుగా రైతులకు చెల్లించేవారు. సామర్లకోటలోని నవభారత్ షుగర్స్ కర్మాగారం రోజుకు 10 నుంచి 15 లక్షల టన్నుల వరకూ చెరకు కొనుగోలు చేసేది. ఇక్కడకు పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, రాజానగరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి తదితర మండలాల రైతులు అధికంగా చెరకు తీసుకుని వచ్చేవారు. తుని తాండవ, పిఠాపురం కిర్లంపూడి షుగర్స్, చెల్లూరు ఫ్యాక్టరీల పరిధిలోని గ్రామాల నుంచి కూడా సామర్లకోట నవభారత్ షుగర్స్‌కు సుమారు 4 లక్షల టన్నులకు పైగా చెరకు వచ్చేది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడుదొడుకుల కారణంగా పదేళ్ల క్రితం పిఠాపురంలోని కిర్లంపూడి షుగర్స్, నాలుగేళ్ల క్రితం చెల్లూరు, మూడేళ్ల క్రితం సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీలను వాటి యజమానులు మూసివేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు చెరకు సాగు తగ్గించి, వరి, ఆరుతడి పంటలపై దృష్టి సారించారు. చెరకు పంట ఒకసారి చేతికి అందేలోగా రెండుసార్లు వరి, ఆరుతడి పంటల దిగుబడులు వస్తుండటంతో రైతులు రానురానూ చెరకు సాగుకు స్వస్తి చెప్పడం ప్రారంభించారు. ఫలితంగా చెరకు కూలీలు కూడా ఉపాధి కోసం వలసలు పోవల్సిన పరిస్థితి ఏర్పడింది.

చెరకును ప్రోత్సహించాలి



వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పించే చెరకు సాగును, షుగర్ పరిశ్రమలను ప్రోత్సహించాలి. ఈ పరిశ్రమ దెబ్బ తినడం వల్ల ప్రభుత్వాలు ఉపాధి హామీ పనులు కల్పించాల్సి వచ్చింది. ఫలితంగా ప్రభుత్వాలపై ఆర్థిక భారం పడింది. చెరకు సాగుకు ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయాలి. చక్కెర పరిశ్రమలను తెరిపించి, చెరకు సాగును ప్రోత్సహించాలి.

– నల్లల గోవిందు, రైతు, కట్టమూరు, పెద్దాపురం మండలం

ఆరుతడి పంటల పైనే దృష్టి



చెరకు సాగుపై రైతులకు ఆసక్తి తగ్గిన మాట వాస్తవమే. ప్రస్తుతం సాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉన్నచోట మాత్రమే బెల్లం తయారీకి ఈ పంటను సాగు చేస్తున్నారు. ఈ పంట సాగుకు పెట్టుబడులు కూడా పెరిగిపోయాయి. చెరకు ఒక పంటకయ్యే ఖర్చుతో ఆరుతడి పంటలు రెండు దఫాలు పండించవచ్చు. శ్రమ కూడా తక్కువే. దీంతో అధిక శాతం రైతులు చెరకుకు ప్రత్యామ్నాయంగా వరి, ఆరుతడి పంటలను ఎంచుకుంటున్నారు.

– దైవకుమార్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, పెద్దాపురం



పెద్దాపురం మండలం చంద్రమాంపల్లిలో చెరకు తోట



తిరుపతి గ్రామంలోని బెల్లం క్రషర్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు


గాయపడిన శంకర్‌ను కాకినాడ తరలిస్తున్న వైద్య సిబ్బంది

సామర్లకోట: కాకినాడ రోడ్డులో సోమవారం జరిగిన ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఏఎస్సై సింహాద్రి కథనం ప్రకారం.. కాకినాడ నగరంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శంకర్ స్థానిక పంచారామ క్షేత్రంలో సోమవారం స్వామి వారిని దర్శించుకొని తిరిగి మోటారు సైకిల్‌పై బయలు దేరారు. కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న కారు వెంకటకృష్ణ రాయపురం– మాధవపట్నం గ్రామాల మధ్య వెనుక నుంచి ఆయనను ఢీ కొట్టింది. దాంతో హెడ్ కానిస్టేబుల్ శంకర్‌తో పాటు కారులో ప్రయాణిస్తున్న మహిళకు కూడా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన శంకర్‌ను కాకినాడలోని ట్రస్టు ఆసుపత్రికి, మహిళను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేను బడికి పోతా..

- కొత్త కార్యక్రమానికి శ్రీకారం
- సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహణ
- పిల్లలను వందశాతం బడుల్లో చేర్చడమే లక్ష్యం
- జూలై 12 వరకూ ప్రత్యేక కార్యాచరణ



రాయవరం: 'నేను బడికి పోతా' అనే కొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మధ్యలో బడి మానేసిన 6 నుంచి 14 ఏళ్ల పిల్లలను తిరిగి చేర్పించడం, వారికి ప్రభుత్వం సమకూర్చే స్టూడెంట్ కిట్లు అందించడం, విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'నేను బడికి పోతా' అమలుకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నారు. ఇందుకు సంబంధించి సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సహకారంతో ఇంటింటికీ తిరుగుతూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. చదువుకోవడం వల్ల కలిగే లాభాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలపై పిల్లలతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకోనున్నారు. ఇలా జూలై 12 వరకూ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. ఇందులో జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకూ అధికారులతో ప్రత్యేక కమిటీలను నియమించనున్నారు. ఆయా కమిటీల సభ్యులు వారికి అప్పగించిన పనులను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వచ్చే నెల 12 వరకూ కార్యక్రమాలు



నేను బడికి పోతా ప్రత్యేక కార్యక్రమం వచ్చే నెల 12వ తేదీ వరకూ జరుగుతుంది. 6 నుంచి 14 ఏళ్ల వయసున్న బడి బయట పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం సమగ్ర శిక్షా, కార్మిక శాఖ, ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, పంచాయతీరాజ్ తదితర శాఖలతో కలసి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

–డి.రమేష్‌బాబు, జిల్లా ఆల్టర్నేటివ్ స్కూల్స్ కో ఆర్డినేటర్, సమగ్ర శిక్షా

విజయవంతం చేయండి



ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమష్టి కృషితో ఈ కార్యక్రమం విజయవంతం చేయాలి. ఆయా కమిటీల్లో ఉండే వారు బాధ్యత తీసుకుని, షెడ్యూల్ ప్రకారం ప్రోగ్రామ్స్ నిర్వహించాలి. కింది స్థాయి నుంచి పైస్థాయి వరకూ అంతా సమన్వయంతో పనులు చేయాలి.

–ఎ.మధుసూదనరావు, జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్, సమగ్ర శిక్షా

సమర్థవంతంగా నిర్వహించాలి



ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి. ఇందుకు గాను కమిటీలను ఏర్పాటు చేశాం. కమిటీల్లోని సభ్యులు నిర్దేశించిన గడువులో ఇంటింటికీ తిరిగి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. ఈ డ్రైవ్‌లో బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.

– ఎం.కమలకుమారి, డీఈఓ

జూలై 12న పేరెంట్స్ కమిటీలు కూడా తమ పాఠశాలల పరిధిలోని పిల్లలందరూ బడుల్లో ఉన్నట్లు ప్రకటించనున్నారు.

జిల్లా కమిటీలో ఎవరు ఉంటారంటే..

డీఈఓ, సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ చైర్మన్‌గా, ఏపీసీ మెంబర్ కన్వీనర్‌గా, లేబర్ శాఖ డీసీ/ఏసీ, ఐటీడీఏ పీఓ, ఐసీడీఎస్ పీఓ, ట్రైబల్, సోషల్, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ డీడీలు, ఎస్సీఎల్పీ డీడీ, మెప్మా పీడీ, డీవైఈఓ, ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా ఉంటారు.

మండల కమిటీల్లో..

మండల విద్యాశాఖ అధికారి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఎంపీడీఓ చైర్మన్‌గా, తహసీల్దార్, ఐసీడీఎస్ సీడీపీఓ, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల నుంచి సంబంధిత అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఉర్దూ స్కూల్ హెచ్‌ఎం, కేజీబీవీ ఎస్‌ఓ, డీఎల్‌ఎంటీ సభ్యులుగా ఉంటారు.

గ్రామ కమిటీల్లో..

పేరెంట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న వ్యక్తి గ్రామ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పాఠశాల హెచ్‌ఎం మెంబర్ కన్వీనర్‌గా, పంచాయతీ కార్యదర్శి, సీఆర్పీ, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ వలంటీర్, అంగన్‌వాడీ ఉద్యోగి సభ్యులుగా ఉంటారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


వారణాసి సీతారామ్ (ఫైల్)

అంబాజీపేట: లారీ ఢీకొన్న ఘటనలో తీవ్రగాయాలైన వ్యక్తి అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. అంబాజీపేట పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన వారణాసి సీతారామ్ (53), అతని భార్య మహాలక్ష్మి, కుమార్తె లాస్యశ్రీలు మోటారు సైకిల్‌పై ఈ నెల 16న అమలాపురంలోని బంధువులు ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా ముక్కామల సమీపంలో రావులపాలెం నుంచి అమలాపురం వైపు వెళుతున్న టిప్పర్ లారీ ఎదురుగా వస్తున్న వీరి మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొంది. తీవ్ర గాయాలైన సీతారామ్‌ను, అతని కుమార్తె లాస్యశ్రీ, మహాలక్ష్మిలను 108 అంబులెన్స్‌లో అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సీతారామ్ మృతి చెందారు. పదేళ్ల లాస్యశ్రీ కుడికాలు తొలగించగా మహాలక్ష్మి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

బాలికపై లైంగిక దాడి

మలికిపురం: మలికిపురం మండలం గూడపల్లి పల్లిపాలెంలో దారుణం జరిగింది. గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 55 ఏళ్ల సంపదరావు ఈ నెల 12న లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై బాలిక తండ్రి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ గోవిందరాజు సోమవారం తెలిపారు.

మోటారు సైకిళ్ల ఢీ: వ్యక్తి మృతి


మణికంఠ (ఫైల్)

అల్లవరం: గోడిలంక ప్రధాన రహదారిపై రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మొగళ్లమూరు గ్రామానికి చెందిన అల్లు గణేష్ మణికంఠ (24) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పీఆర్వోగా పనిచేస్తున్న గణేష్ మణికంఠ శనివారం రాత్రి విధులు ముగించుకుని మొగళ్లమూరులోని తన నివాసానికి వస్తుండగా, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మెడపల జోయల్ అల్లవరం వైపుగా వెళ్తుండగా గోడిలంక వద్ద ఇరువురి బైక్‌లు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి ఆసుపత్రిలో చేర్పించారు. అయితే గణేష్ మణికంఠ పరిస్థితి విషమించడంతో కిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జోయల్ చికిత్స పొందుతున్నాడని ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహా ప్రసాదం స్వామీ

- అప్పనపల్లి నుంచే అన్నదానానికి నాంది
- ఇప్పటికి 67.39 లక్షల మందికి అమలు
- నిరంతరాయంగా కార్యక్రమం


అప్పనపల్లి బాలాజీ సన్నిధిలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మామిడికుదురు: అన్నదానం.. ముక్తికి, మోక్షానికి సోపానం. ఈ నానుడిని అప్పనపల్లి క్షేత్రం నిజం చేస్తోంది. ఆధ్యాత్మిక పరవళ్లు, నిత్య కల్యాణ శోభతో అలరారుతున్న ఈ దేవస్థానం రాష్ట్రంలోనే ప్రప్రథమంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అందుకే ఎంతో ప్రాచుర్యం పొందింది. 1977లో శ్రీబాల బాలాజీ స్వామి కొలువు దీరిన అప్పనపల్లిలో స్వామివారి కరుణా కటాక్షాలతో అన్నదానం ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాటి నుంచి నేటి వరకూ రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ నిర్విరామంగా స్వామివారి సన్నిధిలో అన్నదానం కొనసాగుతోంది. బూరె, పులిహోరా, పప్పు, సాంబారు, పచ్చడి, మజ్జిగతో ఈ క్షేత్రంలో అన్నదానం చేస్తుండడం విశేషం. స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు మహదానందం పొందుతున్నారు. దానికి అనుగుణంగా భక్తులు స్వామివారి సన్నిధిలో అమలు చేస్తున్న అన్నదాన పథకానికి విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. భక్తులు ఇచ్చే విరాళాలతో ఈ పథకాన్ని ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు.

అన్నదానానికి ఆదాయం.. ఖర్చు

స్వామివారి సన్నిధిలో అమలు చేస్తున్న శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టు ద్వారా ఏటా నాలుగు లక్షలకు పైగా భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకూ సుమారు 67.39 లక్షల మందికి అన్నప్రసాదం అందించినట్లు లెక్కలు ఉన్నాయి. 2022–23లో 4,19,902 మంది స్వామివారి ప్రసాదం స్వీకరించారు. భక్తుల నుంచి రూ.1,48,44,119 విరాళాలు రాగా రూ.1,51,21,544 ఖర్చు అయ్యింది. 2023–24లో 4,42,020 మందికి అన్నదానం చేశారు. దీనికిగాను రూ.1,42,11,022 ఆదాయం వచ్చింది. కాగా రూ.1,35,51,054 ఖర్చయ్యిందని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. శని, ఆదివారాల్లో భారీ సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి వస్తున్నారు. మిగిలిన రోజుల్లో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య తక్కువే. స్వామి దర్శనానికి వచ్చే భక్తుల్లో 70 శాతం మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారు.

నాణ్యమైన భోజనం



స్వామివారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తునికి అన్నప్రసాదం అందజేస్తున్నారు. ఎంతో నాణ్యమైన భోజనాన్ని భక్తులకు వండి వడ్డిస్తున్నారు. స్వామివారి అన్న ప్రసాదం ఎంతో అద్భుతంగా ఉంది. ప్రతి ఒక్క భక్తుడు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించి మహదానందం పొందుతున్నారు. ఆలయం ద్వారా అందించే సేవలు ప్రశంసనీయం.

–ఎం.కృష్ణమూర్తి, ఉంద్రాజవరం

అన్నప్రసాదం అద్భుతం



కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనానికి వచ్చాం. ఈ క్షేత్రంలో అన్నప్రసాదం విందు భోజనంలా ఉంది. బూరె, పులిహోర, కూరలతో మంచి ప్రసాదం పెడుతున్నారు. భోజనం చేసిన తరువాత ఎంతో సంతృప్తితో ఆలయం నుంచి బయటకు వెళ్తున్నాం. దీనిని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలి.

– సీహెచ్ గొల్లరాజు, భీమవరం

ఎంతో ఆనందంగా ఉంది



సుదూర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదానం ద్వారా మంచి సేవలందిస్తున్నారు. 30 ఏళ్ల నుంచి ఏటా స్వామి వారి దర్శనానికి వస్తున్నాం. నాడు అన్నదానం ఏ విధంగా ఉందో నేడు కూడా అదే విధంగా అన్నదానం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది.

– దుర్గాప్రసాద్, భీమవరం

పెళ్లిళ్ల పేరయ్య పేరిట టోకరా!

- రూ.కోటికి ఎగనామం
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు


ఆలమూరు పోలీస్ స్టేషన్‌కు దుర్గయ్యపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

ఆలమూరు: పెళ్లి సంబంధాలు కుదుర్చుతానంటూ అమాయక ప్రజలను నమ్మించి రూ.కోటి వరకూ ఓ వ్యక్తి టోకరా వేసిన ఘటన ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారంలో జరిగింది. పెళ్లిళ్ల పేరయ్య అవతారమెత్తి వయసుకు వచ్చిన యువతకు, కొంచెం లోపాలు ఉన్నవారికి పెళ్లి సంబంధాలు చూస్తానంటూ రూ.లక్షల విలువైన బంగారం, నగదు స్వాహా చేసిన వైనం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇప్పటి వరకూ ఆరుగురు బాధితులు వెలుగులోకి రాగా అనేక మంది మోసపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మూలస్థాన అగ్రహారానికి చెందిన యర్రంశెట్టి దుర్గయ్య దివ్యాంగుడు. అతను పెళ్లి సంబంధాలు చూసే దళారీగా అవతారమెత్తాడు. ఇదే క్రమంలో గ్రామంలో దొడ్డా రాంబాబు, వరలక్ష్మి దంపతుల కుమారుడికి పెళ్లి సంబంధాలు చూస్తానంటూ నమ్మబలికాడు. వధువు కుటుంబానికి కొంత నగదు అవసరమంటూ దశల వారీగా రూ.20 లక్షల వరకూ తీసుకున్నాడు. దీంతో పాటు రాంబాబు కుటుంబ సభ్యుల వద్ద సుమారు రూ.12 లక్షల విలువైన 20 కాసుల బంగారాన్ని కూడా తన మాయమాటలతో స్వాహా చేశాడు. ఆ బంగారం ఆ ఆశ చూపి, తక్కువకు వస్తుందంటూ గ్రామానికి చెందిన విజయ, నవాబుపేటకు చెందిన సింగంశెట్టి సురేష్‌ను నమ్మించాడు. విజయ వద్ద రూ.5.5 లక్షలు, సురేష్ వద్ద రూ.4.10 లక్షలు తీసుకుని మాట మార్చేశాడు. దీంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అనేక మంది వద్ద రూ.లక్షలు తీసుకోవడంతో స్వాహా చేసిన సొమ్ము రూ.కోటి పైనే ఉంటుందని సమాచారం. పెళ్లి సంబంధాలకు సంబంధించి అవతలి వారు ఒప్పుకున్నారని ఇతరులతో డమ్మీ ఫోన్లు చేయించేవాడు. జల్సాలకు అలవాటు పడిన దుర్గయ్య స్వాహా చేసిన సొమ్మును అంతా విలాసాలకు ఖర్చు చేశాడు. పెళ్లి సంబంధాలు చూస్తున్నానంటూ కాలయాపన చేస్తున్న దుర్గయ్య ప్రవర్తనపై బాధితులకు అనుమానం వచ్చింది. దీంతో వారంతా సోమవారం దుర్గయ్య ఇంటికి వెళ్లి అతని భార్య రాణి, తల్లి వెంకాయమ్మ, సోదరుడు మురళీని నిలదీయగా అసలు నిజం వెలుగులోకి వచ్చింది. దీంతో బాధితులంతా ఆలమూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎస్సై ఎల్.శ్రీను నాయక్‌కు ఫిర్యాదు చేశారు.


నిందితుడు దుర్గయ్య

జల్సాలకు అలవాటు పడి..

మాయమాటలతో బాధితులను నమ్మించి స్వాహా చేసిన సొమ్మును అనతికాలంలోనే దేశమంతా తిరిగి జల్సాలకు, విలాసాలకు ఖర్చు చేశాడని భార్య రాణి పోలీసులకు వివరించింది. తన భర్త పెళ్లి సంబంధాల పేరిట డబ్బులు తీసుకున్నది వాస్తవమేనన్నారు. సోదరుడు మురళీ, తల్లి వెంకాయమ్మ ప్రోద్బలంతో స్వాహా చేసిన సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేశాడని తెలిపింది. ఇలాంటివి వద్దని పలుమార్లు చెప్పినా పట్టించుకోకుండా చేతిలో ఉన్న డబ్బును చూసి విచ్చలవిడిగా ఖర్చు చేశాడంది. ఈ సొమ్ము దుర్వినియోగంలో కొంత భాగం సోదరుడు, తల్లి ప్రమేయం ఉందని ఆరోపించింది. భార్య, ఇద్దరు పిల్లలను పట్టించుకోకుండా పెళ్లి సంబంధాల పేరిట తీర్థయాత్రలు, విలాసవంతమైన ప్రాంతాలకు వెళ్లేవాడంది. ఇప్పటి వరకూ తమకు సొంత ఇల్లు కూడా లేదని, అద్దె ఇంట్లోనే ఉంటూ జీవనం సాగిస్తున్నామని ఆమె పేర్కొంది. ప్రస్తుతం తన భర్త దుర్గయ్య ఒక్క పైసా కూడా లేకుండా ఖర్చు చేశాడని వివరించింది.

బాధితులకు న్యాయం చేస్తాం..

పెళ్లి సంబంధాల పేరిట మోసపోయిన బాధితులందరికీ తగిన న్యాయం చేస్తామని ఎస్సై శ్రీను నాయక్ భరోసా ఇచ్చారు. దీనిపై కేసు నమోదు చేస్తున్నామని, విచారణ జరిపి నిందితుడు దుర్గయ్యతో పాటు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుంటామన్నారు. స్వాహా చేసిన నగదు, బంగారాన్ని రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఉచిత ఇసుక పక్కదారి..

- కూటమి నేతల ప్రోద్బలంతోనే తంతు
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


కపిలేశ్వరపురంలో ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: వరదల సమయంలో వినియోగదారుల కోసం గత ప్రభుత్వం నిల్వ ఉంచి ఇసుకను కూటమి నేతల ప్రోద్బలంతో అక్రమంగా తరలిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండిపడ్డారు. ఇసుకను ఉచితంగా ఇస్తామన్న కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక నిల్వలను అక్రమంగా అమ్మేసుకోవడం ఏపాటి ధర్మమో తెలియజేయాలన్నారు. కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపు వద్ద ఉన్న నిల్వలను సోమవారం మండలంలోని ప్రజాప్రతినిధులతో కలసి ఆయన పరిశీలించారు. ఇసుక నిల్వలను రేయింబవళ్లు తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. వారికి భయపడి అధికారులు సైతం ఏమీ చేయలేకపోతున్నారని అన్నారు. అక్రమంగా తరలిస్తున్న విషయం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు తెలియక జరుగుతుంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తెలిసే జరిగితే ఆయన విజ్ఞతకే వదిలేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీలం గోవింద్, ఎంపీటీసీ సభ్యులు గొల్లపల్లి సోనియా, శీలం భాస్కర్, యర్రంశెట్టి నాగేశ్వరరావు, జుత్తుక వెంకటలక్ష్మి, మేడిశెట్టి దుర్గారావు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, నాయకులు కట్టా మురళి, పిప్పర సంపతరావు, యర్రా వీరన్నబాబు, ప్రగడ అర్జునరావు, పోలిశెట్టి గణేష్, గూటం సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

దేవరపల్లి: దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ముగిసింది. ఆదివారం అర్ధరాత్రి వరకూ ఫ్లెడ్‌లైట్ల వెలుతురులో పోటీలను హోరాహోరీగా నిర్వహించారు. తమిళనాడుకు చెందిన వివేకానంద, గుడ్ సమరిటన్ ఇనిస్టిట్యూషన్స్, స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఈ టోర్నమెంట్‌ను అకాడమీ డైరెక్టర్ ప్రవీణ్ వసంత్ జబేజ్ పర్యవేక్షించారు. రాష్ట్ర స్థాయి అండర్ –14 విభాగంలో 16 జట్లు, అండర్ –17 విభాగంలో 24 జట్లు పాల్గొని తమ ప్రతిభ చూపాయి. టోర్నమెంట్‌లో అండర్–17 విభాగంలో అనంతపురం, ఏలూరు, వీటీహెచ్ నూజివీడు క్రీడాకారులు విజయం సాధించగా, అండర్– 14 విభాగంలో ఏపీఎస్పీ కాకినాడ, వీటీహెచ్ నూజివీడు, అనంతపురం క్రీడాకారులు విజయం సాధించినట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, శాప్ మాజీ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ సోమవారం తెలిపారు. విజేతలకు తమిళనాడులోని అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత విద్యతో పాటు క్రీడా శిక్షణ ఇస్తారన్నారు. ఇంటర్మీడియెట్ వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు. విజేతలకు అకాడమీ డైరెక్టర్ ప్రవీణ్ వసంత్ జాబెజ్ బహుమతులు అందజేశారు.


అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ ప్రవీణ్ వసంత్ జబేజ్


అండర్-14 విభాగంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రవీణ్ వసంత్ జబేజ్